క్లుప్తంగా

సీఎంఆర్‌ఎఫ్‌తో మెరుగైన వైద్యం



అలంపూర్: సీఎంఆర్‌ఎఫ్‌తో మెరుగైన వైద్య సేవలు పొందవచ్చని ఎమ్మెల్యే విజయుడు అన్నారు. కర్నూలులోని ఎమ్మెల్యే నివాసంలో సీఎం సహాయ నిధి ద్వారా మంజూరైన ఎల్‌ఓసీని ఎమ్మెల్యే అందజేశారు. మండలంలోని సుల్తానాపురం గ్రామానికి చెందిన వెంకటేశ్వర్లు వైద్య చికిత్స నిమిత్తం సీఎం సహాయ నిధికి దరఖాస్తు చేసుకోగా రూ.2 లక్షల ఎల్‌ఓసీ వచ్చినట్లు తెలిపారు. గురువారం ఎల్‌ఓసీని కుటుంబ సభ్యులకు అందజేసినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో నాయకులు వావిలాల రంగారెడ్డి, మాజీ సర్పంచ్ చిన్నమారెన్న తదితరులు పాల్గొన్నారు.

పెండింగ్ పనులు పూర్తి చేయాలి



మానవపాడు: ఎన్‌ఆర్‌ఈజీఎస్ పెండింగ్ పనులు త్వరితగతిన పూర్తి చేయాలని ఎంపీడీఓ భాస్కర్ అన్నారు. మండల కేంద్రంలోని మండల ప్రజా పరిషత్ ఉన్నత పాఠశాలలో గురువారం ఫీల్డ్ అసిస్టెంట్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వనమహోత్సవానికి ఏర్పాట్లు పూర్తి చేయాలన్నారు. గ్రామాల్లో పనులను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తామన్నారు. సిబ్బంది పూర్తిస్థాయిలో సహకరించి పెండింగ్ పనులు పూర్తి చేయాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సరైన పౌష్టికాహారం అందించాలి



మానవపాడు: అంగన్‌వాడీల్లో చిన్నారులకు సరైన పౌష్టికాహారం అందించాలని సూపర్‌వైజర్ లక్ష్మి అన్నారు. గురువారం మండల కేంద్రంలోని అంగన్‌వాడీ కేంద్రం–1ను పరిశీలించారు. చిన్నారులు 0–5 సంవత్సరాలు ఉన్న ప్రతి ఒక్కరూ వయస్సుకు తగిన బరువు, ఎత్తు ఉండేలా చూసుకోవాలన్నారు. ఆరోగ్యంపై గర్భిణులు, బాలింతలకు అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్ సుమిత్ర, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ పాలనలో జవాబుదారీతనం

అయిజ: బీజేపీ పాలనలోనే జవాబుదారీతనం, నీతి నిజాయతీలు ఉన్నాయని బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు కృష్ణస్వామిరెడ్డి అన్నారు. మండల కేంద్రంలో గురువారం బీజేపీ పట్టణ అధ్యక్షుడు భగత్‌రెడ్డి ఆధ్వర్యంలో వికసిత భారత్.. అమృతకాలం సంకల్ప సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథిగా బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు హాజరై మాట్లాడారు. రానున్న ఎన్నికల్లో బీజేపీ గెలుపు కోసం ప్రతి కార్యకర్త కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు వీరేష్‌గౌడ్, రాజశేఖర్, రఘు, ఇబ్రహీం, బసవరాజు తదితరులు పాల్గొన్నారు.

యుద్ధంతో ప్రపంచానికి ముప్పు

గద్వాల: ఇజ్రాయెల్ చేస్తున్న యుద్ధం వలన ప్రపంచానికి పెనుముప్పు ఏర్పడిందని, అమెరికా ప్రోద్బలంతో చేస్తున్న యుద్ధాన్ని తక్షణమే ఆపాలని సీపీఐ, సీపీఎం నాయకులు బి.ఆంజనేయులు, నర్సింహ డిమాండ్ చేశారు. గురువారం జిల్లా కేంద్రంలోని పాత బస్టాండులో నిరసన ప్రదర్శన చేపట్టారు. పాలస్తీనా యుద్ధంలో 50వేల మంది మరణించారని, లక్షలాది మంది ప్రజలు నిరాశ్రయులయ్యారని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో నాయకులు ప్రభాకర్, రంగన్న, ఆశన్న, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

వక్ఫ్ భూమి వేలం వాయిదా

ఉండవెల్లి: మండలంలోని బొంకూరు గ్రామ పంచాయతీ కార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన వక్ఫ్ భూమి వేలం పాటను అధికారులు వాయిదా వేశారు. బొంకూరులో సర్వే నంబర్ 61, 69, 154, 159, చెన్నిపాడు శివారులోని 35, 37లో ఉన్న భూమి వ్యవహారం కోర్టులో ఉండగా వేలం ఎలా నిర్వహిస్తారని రైతులు ఆందోళన చేశారు. ఈ క్రమంలో తహసీల్దార్ ప్రభాకర్ వేలం వాయిదా వేశారు. కార్యక్రమంలో వక్ఫ్ భూమి ఇన్‌స్పెక్టర్ సిరాజుద్దీన్, ఆర్‌ఐ నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

వంతెనల నిర్మాణాలు పూర్తయ్యేనా?

- ఏళ్లు గడుస్తున్నా పూర్తికాని పనులు
- వాగుల ఉధృతికి తెగిన కల్వర్టులు
- ప్రమాదాలకు గురవుతున్న ప్రయాణికులు



పిల్లర్ గుంతలకే పరిమితమైన ఆర్.గార్లపాడు పెద్దవాగుపై వంతెన పనులు

ఎర్రవల్లి: మండలంలో పలు వాగులపై వంతెనలు లేకపోవడంతో నిత్యం ఇబ్బందులు పడుతున్నట్లు మండల ప్రజలు వాపోతున్నారు. వర్షాకాలం వచ్చిందంటే చాలు వాగులు ఉప్పొంగి పారడం వల్ల పక్క గ్రామాలకు కూడా వెళ్లలేని పరిస్థితి నెలకొందంటున్నారు. తప్పని పరిస్థితుల్లో ప్రాణాలకు తెగించి వాగును దాటేందుకు ప్రయత్నిస్తే ప్రమాదాల బారిన పడి ప్రాణాలు కోల్పోతున్నట్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వర్షాకాలంలో ప్రారంభమైన నేపథ్యంలో ప్రజా ప్రతినిధులు, ఉన్నతాధికారులు స్పందించి ఆయా గ్రామాల సమీపంలో ఉధృతంగా ప్రవహించే వాగులపై వంతెనలు ఏర్పాటు చేయాలని, నిర్మాణంలో ఉన్న వంతెనలు త్వరితగతిన పూర్తి చేయాలని మండల ప్రజలు కోరుతున్నారు.

ఉమ్మడి ఇటిక్యాలలో పరిస్థితి ఇలా..

- ఎర్రవల్లి మండల పరిధిలోని ఆర్. గార్లపాడు, సాసనూలు, షేకుపల్లి గ్రామాల సమీపంలోని ఐదు పెద్దవాగులు వర్షాకాలం ప్రారంభమైతే చాలు రోజుల తరబడి ఉధృతంగా ప్రవహిస్తాయి.
- ఆర్.గార్లపాడు పెద్దవాగుపై బ్రిడ్జి నిర్మాణం ప్రారంభమై ఏడు సంవత్సరాలు గడుస్తున్నా పనులు పూర్తి కాకపోవడంతో చుట్టు పక్కల గ్రామాల ప్రజలు నిత్యం ఇబ్బందులు పడుతున్నారు.
- షేకుపల్లి గ్రామ సమీపంలో పెద్దవాగుపై చేపట్టిన బ్రిడ్జి నిర్మాణం పనులు ప్రారంభించి దాదాపు మూడు సంవత్సరాలు కావస్తుంది. కానీ ఇప్పటి వరకు యాభైశాతం పనులు కూడా పూర్తి కాలేదు. కాంట్రాక్టర్ పనులను మధ్యలోనే వదిలేసి వెళ్లిపోయాడు. బ్రిడ్జి నిర్మాణం కోసం పక్కన వేసిన తాత్కాలిక రోడ్డు గుంతలు పడి అధ్వానంగా మారింది.
- షేకుపల్లి చిన్నవాగుపై నిర్మిస్తున్న బ్రిడ్జి దాదాపు పూర్తయింది. కానీ బ్రిడ్జిపై బీటీ రోడ్డును ఏర్పాటు చేయలేదు. కేవలం కంకరను మాత్రమే వేసి వదిలేశారు.
- సాసనూలు గ్రామ సమీపంలో ఉన్న రెండు వాగులపై కల్వర్టులు పూర్తిగా పాడయ్యాయి. ద్విచక్ర వాహనదారులు వరద ఉధృతి వల్ల ప్రమాదాలకు గురవుతున్నారు.
- ఇటిక్యాల మండల కేంద్రం నుంచి చాగాపురం, ఉదండాపురం గ్రామం నుంచి ఎస్సీ కాలనీ, ఉదండాపురం నుంచి సాతర్లకు వెళ్లే దారిలో ఉన్న నాలుగు వాగులకు వంతెనలు లేకపోవడంతో ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారు.



మధ్యలోనే నిలిచిన షేకుపల్లి పెద్దవాగు బ్రిడ్జి పనులు



కంకరకే పరిమితమైన షేకుపల్లి చిన్నవాగు బ్రిడ్జి

పనులు త్వరగా పూర్తి చేయాలి



మా గ్రామం నుంచి ఎర్రవల్లి మండల కేంద్రానికి వెళ్లడానికి వాగులపై వంతెనలు సక్రమంగా లేకపోవడంతో వర్షాకాలంలో తీవ్ర ఇబ్బంది పడుతున్నాం. వర్షాకాలం వచ్చిందంటే చాలు వాగుల ప్రవాహం కారణంగా రోజుల తరబడి గ్రామంలోనే ఉండాల్సి వస్తుంది.

– హసన్‌బాబు, షేకుపల్లి

పనులు ప్రారంభించి ఏడేళ్లు



మా ఊరి సమీపంలోని పెద్దవాగుపై బ్రిడ్జి నిర్మాణం చేపట్టి ఏడేళ్లు పూర్తయింది. పనులు నత్తనడకన సాగుతుండటంతో నేటి వరకు పూర్తి కాలేదు. గత వర్షాకాలంలో తాత్కాలికంగా ఏర్పాటు చేసిన మట్టి రోడ్డు కూడా పూర్తిగా వర్షపు నీటిలో కొట్టుకుపోయింది.

– చిన్న వీరన్న, రాజశ్రీ గార్లపాడు

నివేదిక అందజేశాం

గార్లపాడు వద్ద బ్రిడ్జి నిర్మాణ పనులు ప్రారంభించి ఫిల్లర్ గుంతలను తీశాక వర్షాలు అధికంగా పడటంతో వరదనీరు ఫిల్లర్ గుంతలలో చేరడం వల్ల పనులు ఆగిపోయాయి. జూరాల కాల్వ నుంచి మండంలోని పలు వాగుల్లోకి వరద చేరడం వల్ల నిర్మాణ పనులు ముందుకు సాగడం లేదు. అధికంగా వరద వచ్చే వాగులపై వంతెనల నిర్మాణాలకు ఉన్నతాధికారులకు నివేదికలు అందజేశాం. అనుమతులు రాగానే నిర్మాణ పనులు ప్రారంభిస్తాం.

– రాజేశ్వరి, ఆర్‌అండ్‌బీ ఏఈఈ, అలంపూర్

పాఠశాలల్లో సమస్యల తిష్ట

జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాలల్లో తిష్టవేసిన సమస్యలపై సాక్షి విజిట్‌లో వెలుగుచూసిన పలు సమస్యలు.



మానవపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో అసంపూర్తిగా ఉన్న బాలికల మరుగుదొడ్లు

ఇక్కడ కనిపిస్తున్నది మానవపాడు మండలంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల. ఇక్కడ మొత్తం 460 విద్యార్థులు చదువుతున్నారు. పాఠశాలలో బాలికలకు, బాలురకు మరుగుదొడ్లు లేక విద్యార్థులు అవస్థలు పడుతున్నారు. మరుగుదొడ్లు అసంపూర్తిగా నిర్మించి విదిలేశారు.



ప్రహరీ గోడ లేక ప్రమాదభరితంగా ఉన్న నసనూరు పాఠశాల

ఇక్కడ కనిపిస్తున్నది రాజోళి మండలం నసనూరులోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల ఆవరణ. ఈ పాఠశాల ప్రధాన రోడ్డుకు అనుకుని ఉండటం, ప్రహరీ లేకపోవడంతో ఎక్కడ విద్యార్థులు రోడ్డుపైకి వెళ్తారో వాహనాలతో ప్రమాదం పొంచి ఉందని ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. దీనికితోడు పాఠశాలకు సెలవు వచ్చిందంటే అల్లరిమూకలు ఈ పాఠశాల ఆవరణలోకి వచ్చి మద్యం తాగి సీసాలు పగులగొడుతున్నారు. ఇటీవల తాగునీటి కొళాయిలు కూడా ధ్వంసం చేశారు. ప్రహరీ నిర్మించాలని, కొళాయిలు, మిషన్ భగీరథ పైపులైన్ కనెక్షన్ ఇవ్వాలని గ్రామస్తులు కోరుతున్నారు.

సీజనల్ వ్యాధులతో అప్రమత్తంగా ఉండాలి



వాయిల్‌కుంటతండాలో నిర్వహిస్తున్న వైద్య శిబిరం

గట్టు: సీజనల్ వ్యాధులతో వైద్య సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని ఎంపీడీఓ చెన్నయ్య అన్నారు. గురువారం వాయిల్‌కుంటతండాలో జన్ జాతీయ గౌరవ వర్ష- వికసిత భారత్, గిరిజన సాధికారత, దత్తజన భాగీదారి అభియాన్ కార్యక్రమంలో భాగంగా వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామస్తులకు వైద్య పరీక్షలు నిర్వహించి, మందులు అందజేశారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ.. అంటు వ్యాధులు ప్రబలకుండా ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. గ్రామ పరిసరాలు పరిశుభ్రంగా ఉండే విధంగా ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో హెచ్‌డబ్ల్యూఓ పవన్‌కుమార్, గిరిజన సంక్షేమ శాఖ అధికారులు, మెడికల్ అధికారులు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

క్రీడా పాఠశాలలో ప్రవేశానికి దరఖాస్తులు

అయిజ: తెలంగాణ స్పోర్ట్స్ అథారిటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న క్రీడా పాఠశాలలో 2025- 26 విద్యా సంవత్సరానికి సంబంధించి నాల్గవ తరగతిలో ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఎంఈఓ రాములు అన్నారు. గురువారం మండల కేంద్రంలోని జెడ్పీహెచ్‌ఎస్‌లో పీడీలతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఈఓ మాట్లాడారు. హాంకీంపేట, కరీంనగర్, ఆదిలాబాద్ క్రీడా పాఠశాలలో ప్రవేశాలకు మూడు అంచెల్లో ఎంపిక విధానం ఉంటుందన్నారు. మొత్తం 120 సీట్లకు ఎంపిక జరుగుతుందని తెలిపారు. జూన్ 20న అయిజ మండలంలో మండల స్థాయి ఎంపిక ఉంటుందన్నారు. మండలస్థాయిలో ఎంపికైన విద్యార్థులకు జిల్లా స్థాయిలో జూన్ 23 నుంచి 26 వరకు పోటీలు నిర్వహిస్తారన్నారు. రాష్ట్ర స్థాయిలో జూలై 1 నుంచి 6 వరకు ఎంపిక జరుగుతుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో పీడీలు సంతోష్, జగదాష్, రఘు తదితరులు పాల్గొన్నారు.



అయిజలో మాట్లాడుతున్న ఎంఈఓ రాములు

క్రీడలపై అవగాహన కల్పించాలి

ఉండవెల్లి: ప్రైమరీ స్కూల్ విద్యార్థులను మండల స్థాయి నుంచి జిల్లాస్థాయి క్రీడలకు ఎంపిక చేస్తున్నట్లు పీడీ శైలజ అన్నారు. మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు ఎంఈఓ రామకృష్ణ క్రీడలు ప్రారంభించారు.

భూ సమస్యల పరిష్కారానికే సదస్సులు

అలంపూర్: భూ సమస్యల పరిష్కారానికే ప్రభుత్వం భూ భారతి రెవెన్యూ సదస్సుల్లో నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ మంజుల అన్నారు. పట్టణంలో భూ భారతి రెవెన్యూ సదస్సు గురువారం నిర్వహించారు. మున్సిపాలిటీ పరిధిలోని రైతులు నుంచి వివిధ సమస్యలపై పరిష్కారం కోరుతూ 34 దరఖాస్తులు వచ్చినట్లు తహసీల్దార్ తెలిపారు. కార్యక్రమంలో డీటీ తహసీల్దార్ వేణుగోపాల్‌రెడ్డి, సీనియర్ రెవెన్యూ సహాయకులు సుచిత్ర, ఆంజనేయులు, ఆర్‌ఐలు దుర్గా సింగ్, మాసుంబాష తదితరులు పాల్గొన్నారు.

సదస్సు సద్వినియోగం చేసుకోవాలి

గట్టు: రెవెన్యూ సదస్సులు ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ మదన్‌మోహన్‌గౌడ్ రైతులకు సూచించారు. మాచర్ల గ్రామంలో నిర్వహించి రెవెన్యూ సదస్సులో వివిధ రకాల భూ సమస్యలపై 24 దరఖాస్తులు అందినట్లు తెలిపారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ విజయ్‌కుమార్, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.



అలంపూర్‌లో రెవెన్యూ సదస్సులో దరఖాస్తులు అందజేస్తున్న రైతులు

పారుచర్లలో రెవెన్యూ సదస్సు

ధరూరు: మండల పరిధిలోని పారుచర్ల రైతువేదికలో నిర్వహించిన రెవెన్యూ సదస్సుల్లో 23 దరఖాస్తులు వచ్చినట్లు తహసీల్దార్ నరేందర్ తెలిపారు. కార్యక్రమంలో డీటీ అలివేలు మంగమ్మ, సీనియర్ అసిస్టెంట్ తిరుమలేష్, ఆర్‌ఐ తేజ, రెవెన్యూ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా రాహుల్‌గాంధీ జన్మదిన వేడుకలు

గద్వాలటౌన్: ఏఐసీసీ అగ్రనాయకుడు, పార్లమెంటరీ నేత రాహుల్‌గాంధీ జన్మదిన వేడుకలు కాంగ్రెస్ నాయకులు ఘనంగా నిర్వహించారు. గురువారం యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు తిరుమలేష్ ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి వేడుకలు నిర్వహించారు. అనంతరం ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరాన్ని సీనియర్ కాంగ్రెస్ నాయకులు మధుసూదన్‌బాబు, మోహన్‌రావు ప్రారంభించారు. 2029 ఎన్నికల్లో కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తుందని, రాహుల్‌గాంధీ ప్రధాని అవుతారని ఆకాంక్షించారు. రక్తదానం అన్నింటికన్నా మిన్న అని, ఆపత్కాలంలో అవసరమైన రక్తాన్ని అందించి ప్రాణాన్ని రక్షించాలని సూచించారు. కార్యక్రమంలో నాయకులు ఇసాక్, సుకన్య, ఖయ్యూం, సద్దాం, శ్రీనివాస్‌గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

పీహెచ్‌సీలో పండ్లు పంపిణీ

అయిజ: కాంగ్రెస్ పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీ జన్మదినం సందర్భంగా మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో కాంగ్రెస్ నాయకులు రోగులకు పండ్లు, బ్రెడ్లు పంపిణీ చేశారు. రైతు సంఘం కార్యాలయ భవనంలో కేక్ కట్‌చేసి సంబరాలు జరుపుకున్నారు. కార్యక్రమంలో అలంపూర్ మార్కెట్ యార్డ్ కమిటీ చైర్మన్ దొడ్డెన్న, రైతు సంఘం అధక్ష్యుడు మేకల నాగిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా జన్మదిన వేడుకలు

ఎర్రవల్లి: మండల కేంద్రంలో కాంగ్రెస్ ఆధ్వర్యంలో జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. పార్టీ మండలాధ్యక్షుడు వెంకటేష్‌యాదవ్ కూడలిలో కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం పార్టీ శ్రేణులకు మిఠాయిలు పంచిపెట్టారు. కార్యక్రమంలో నాయకులు సోమనాద్రి, నాగరాజు, యువరాజు, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.



గద్వాలలో రాహుల్ గాంధీ జన్మదిన వేడుకలు నిర్వహిస్తున్న కాంగ్రెస్ నాయకులు

గ్యాస్ లీక్.. చెలరేగిన మంటలు

ఉండవెల్లి: మండలంలోని మారమునగాల–1 గ్రామంలో గురువారం రాత్రి చిన్నమద్దిలేటికి చెందిన చికెన్ షాపులో గ్యాస్ లీకై మంటలు చెలరేగాయి. మంటలు అమాంతం పెరగడంతో షాపులో ఉన్నవారు బయటకు పరుగులు తీసి ప్రాణాలను కాపాడుకోగా షాపులో ఉన్న సామగ్రి పూర్తిగా దగ్ధమైంది. స్థానికులు ఫైర్ సిబ్బందికి సమాచారమివ్వగా ఫైర్ హెడ్ కానిస్టేబుల్ కురుమూర్తి ఆధ్వర్యంలో సిబ్బంది మంటలు అదుపులోకి తెచ్చారు. సుమారు రూ. 50 వేలు నష్టం సంభవించినట్లు బాధితుడు పేర్కొన్నారు.

హద్దులు ఏర్పాటు చేసుకోవాలి

మానవపాడు: బస్టాండ్ ఆవరణలో 10 బై 10 అడుగుల కొలతతో హద్దులు ఏర్పాటు చేసుకుంటే షాపులు కట్టి అద్దెకు ఇస్తామని ఆర్టీసీ డీఎం సునీత అన్నారు. గురువారం మండల కేంద్రంలోని బస్టాండ్ ఆవరణను పరిశీలించారు. బస్టాండ్ ఆవరణ పరిశుభ్రంగా ఉంచాలని సిబ్బందికి సూచించారు. ఆవరణలో మురుగు నిల్వ ఉండకుండా, ప్రయాణికులకు అసౌకర్యం కలుగకుండా చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో అధికారులు, షాపుల యాజమానులు పాల్గొన్నారు.

మానసిక ప్రశాంతతకు యోగా దోహదం

ఇటిక్యాల: మానసిక ప్రశాంతత పెంచేందుకు యోగా దోహద పడుతుందని ఆయుష్ మండల వైద్యాధికారి ముబీనా తబసుమ్ అన్నారు. గురువారం మండల కేంద్రంలోని తెలంగాణ సాంఘీక సంక్షేమ పాఠశాలలో యోగాపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆయుష్ సేవలను మండల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అన్ని గ్రామాల్లో ఆయుష్ శాఖ నేతృత్వంలో ప్రజా అవగాహన సదస్సులు, కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో హెచ్‌ఎం సురేష్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రేపు ప్రత్యేక యోగా

ధరూరు: అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకొని శనివారం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రత్యేక యోగా కార్యక్రమం నిర్వహించనున్నట్లు జీహెచ్‌ఎం ప్రతాప్‌రెడ్డి తెలిపారు. ఉదయం 7 గంటలకు జరిగే యోగా కార్యక్రమంలో స్థానిక ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి, జిల్లా అదనపు కలెక్టర్ లక్ష్మీనారాయణ, డీఈఓ అబ్దుల్ ఘని, ఎంఈఓ రవీంద్రబాబు ముఖ్య అతిథులుగా హాజరు కానున్నట్లు పేర్కొన్నారు.

కార్మికులకు బకాయి వేతనాలు చెల్లించాలి

రాజోళి: మేజర్ గ్రామ పంచాయతీలో విధులు నిర్వర్తిస్తున్న పారిశుద్ధ్య కార్మికులకు బకాయి వేతనాలు చెల్లించాలని సీపీఎం మండల కార్యదర్శి విజయ్‌కుమార్ డిమాండ్ చేశారు. సీపీఎం పార్టీ ఆధ్వర్యంలో ప్రత్యేకాధికారి ఖాజామొయినుద్దీన్‌కు గురువారం మండల కేంద్రంలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గతంలో సర్పంచులు పదవీ కాలంలో కార్మికులకు వేతనాలు పెంచుతూ తీర్మానం చేశారని, కానీ నేటి వరకు కార్యరూపం దాల్చలేదన్నారు. కార్మికులకు కనీసం వేతనాలు అందకపోవడం దారుణమన్నారు. కార్యక్రమంలో లక్ష్మన్న, సోలు, రాజు, అశోక్, సుందర్ రాజు, రవి పాల్గొన్నారు.



వినతిపత్రం అందజేస్తున్న కార్మికులు

లంపీస్కిన్ వ్యాధి నివారణ టీకాలు

ధరూరు: పశువులకు లంపీ స్కిన్(ముద్దచర్మ) వ్యాధి నివారణ టీకాలను తప్పనిసరిగా వేయించాలని మండల పశువైద్యాధికారి వెంకటరాజు అన్నారు. గురువారం మండల పరిధిలోని బూరెడ్డిపల్లిలో పశువులకు వ్యాధి నివారణ టీకాలు వేసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా రైతులకు పలు సూచనలు, సలహాలు చేశారు. పశువుల చర్మంపై గడ్డలు, జ్వరం, కణుపుల వాపు, శ్వాసకోశ లక్షణాల కనిపిస్తే వెంటనే వైద్య సిబ్బందిని సంప్రదించాలన్నారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది రాఘవేంద్ర, పవన్, రషీద్, అనిల్ తదితరులు పాల్గొన్నారు.



పశువులకు టీకాలు వేస్తున్న వైద్య సిబ్బంది

ప్రభుత్వ పాఠశాలల్లోనే మెరుగైన విద్య



కేటీదొడ్డిలో మధ్యాహ్న భోజనాన్ని పరిశీలిస్తున్న ఎంఈఓ వెంకటేశ్వర్‌రావు

కేటీదొడ్డి: ప్రభుత్వ పాఠశాలల్లోనే మెరుగైన విద్య అందుతుందని ఎంఈఓ వెంకటేశ్వరరావు అన్నారు. గురువారం మండల పరిధిలోని పాతపాలెం, నందిన్నె, కేటీదొడ్డి ప్రభుత్వ పాఠశాలను సందర్శించి మాట్లాడారు. తరగతి గదులు, మధ్యాహ్న భోజనాన్ని తనిఖీ చేశారు. బడిబాట కార్యక్రమానికి సంబంధించి అడ్మిషన్ వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం పాతపాలెం పాఠశాలలో యూనిఫాంలను పరిశీలించి సకాలంలో విద్యార్థులకు అందేలా కృషి చేయాలని ఏపీఎంను ఆదేశించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం విజయభాస్కర్, మురళీ తదితరులు పాల్గొన్నారు.

చదువుపై దృష్టి సారించాలి

గట్టు: విద్యార్థులు చదువుపై దృష్టిని సారించి, భవిష్యత్‌లో ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని ఎంఈఓ నల్లారెడ్డి అన్నారు. మండల కేంద్రంలోని కస్తూర్బా పాఠశాలను ఎంఈఓ తనిఖీ చేశారు. అనంతరం తరగతి గదులు, ల్యాబ్ పరిశీలించి ఉపాధ్యాయులకు పలు సూచనలు ఇచ్చారు. కార్యక్రమంలో ఎస్‌ఓ గోపిలత, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



తిమ్మాజిపల్లెలో విద్యార్థులతో ఓనమాలు రాయిస్తున్న ఎంఈఓ నర్సింహులు

ఆదర్శం తిమ్మాజిపల్లె పాఠశాల

శాంతిగనగర్: మండలంలోని తిమ్మాజిపల్లె ప్రభుత్వ పాఠశాల అందరికీ ఆదర్శమని ఎంఈఓ నర్సింహులు అన్నారు. గత 10 ఏళ్లుగా గ్రామంలో యువకులు తెచ్చిన చైతన్యంతో గ్రామానికి చెందిన ఏ ఒక్కరూ కూడా ప్రైవేట్ పాఠశాలలకు వెళ్లడం లేదన్నారు. ఈ క్రమంలో పదో వసంతంలోకి అడుగు పెడుతున్న సందర్భంగా పాఠశాలలో అక్షరాభ్యాస కార్యక్రమం నిర్వహించారు. ఎంఈఓ చిన్నారులతో ఓనమాలు దిద్దించారు. అనంతరం ఉచిత పుస్తకాలు, దుస్తులు పంపిణీ చేశారు. ప్రధానోపాధ్యాయుడు యాదయ్య, దేవేందర్, వెంకట్రాములు, దస్తగిరి, నాగేష్‌యాదవ్ పాల్గొన్నారు.

కేజీబీవీ పరిశీలన

మానవపాడు: మండల కేంద్రంలోని కేజీబీవీ పాఠశాలను ఎంఈఓ శివప్రసాద్ పరిశీలించారు. ఈ సందర్భంగా అడ్మిషన్ల వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం విద్యార్థుల తల్లిదండ్రులతో మాట్లాడారు. కార్యక్రమంలో కేజీబీవీ టీచర్లు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

అర్హులకే సదరం సర్టిఫికెట్ ఇవ్వాలి..

మానవపాడు: సదరం సర్టిఫికెట్లు లంచాలు తీసుకొని అక్రమంగా మంజూరు చేస్తున్నారంటూ గురువారం డీఆర్డీఓ నర్సింగరావుకు రాష్ట్ర రోడ్డు ట్రాన్స్‌పోర్ట్ అథారిటీ మెంబర్ పల్లి సతీష్‌రెడ్డి ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జిల్లా వ్యాప్తంగా అర్హత లేకపోయిన అడ్డగోలుగా సదరం సర్టిఫికెట్లు జారీ చేస్తున్నారని ఆరోపించారు. 2014 నుంచి 19 జూన్ 2025 వరకు రూ. 50 వేల వరకు లంచం వసూలు చేసి అర్హత లేకున్నా సదరం సర్టిఫికెట్ మంజూరు చేస్తున్నారని ఆరోపించారు. అక్రమ వసూళ్ల వ్యవహారం, సంబంధిత డాక్టర్లు, దళారులపై సమగ్ర దర్యాప్తు చేయించాలని పేర్కొన్నారు.



డీఆర్డీఓ నర్సింగరావుకు ఫిర్యాదు అందిస్తున్న సతీష్‌రెడ్డి